# ఆమె నవ్వింది

ఉదయిస్తూన్న సూర్యుడి లేతకాంతిలో, ఒళ్ళు విరుచుకుంటూ నిద్ర లేస్తూన్న బస్ స్టాప్... శుభ్రతనీ, సౌందర్యాన్ని మర్చిపోయిన బాలింతరాలిలా వుంది.

రాత్రంతా దాన్ని ఆక్రమించుకున్న ముష్టివాళ్ళు తమ చింకిచాపలూ, గోనె సంచులూ చుట్టబెట్టుకుని వెళ్ళిపోతున్నారు.. ప్రయాణీకుల కోసం దాన్ని ఖాళీ చేస్తూ.

కష్టజీవి అయిన ఓకుష్టువాడు మాత్రం, ఒక చేతిలో కర్రా, మరోచేతిలో డబ్బా పట్టుకుని అప్పటికే డ్యూటీలో జాయినయిపోయాడు.

పుస్తకాల గోతాలు మోస్తూన్న బడిపిల్లల్నీ, ఎందుకు తెల్లవారిందా అని ఏడుస్తూన్న చిరుద్యోగుల్నీ కూడా వదలకుండా అడుక్కుంటున్నాడు వాడు.. తన హక్కులేమిటో తనకు క్షుణ్ణంగా తెలిసిన పౌరుడిలాగా.

మరోప్రక్కన.. సీతాకోకచిలుకల్లా తయారయి వచ్చిన కాలేజీ అమ్మాయిలు.. ఎక్కడ పెడితే తమ పాదాలకు తక్కువ మురికి అంటుతుందో అర్థం కాక సతమతమవుతున్నారు.

అబ్బాయిలేమో, ఏ అంగుళాన్నైనా తమ పాన్ మరకలతో పావనం చేయకుండా వదిలేశామేమో అని కంగారుగా వెతుక్కుంటున్నారు.

ఎవరెవరో వస్తున్నారు. వెళ్తున్నారు. సునీల్ ఎవరికోసం ఎదురుచూస్తున్నాడో... ఆమె మాత్రం రాలేదు.

అప్పటికి గంటయింది అతను బస్ స్టాప్ కి వచ్చి. రెండు బస్ లు వెళ్ళిపోయాయి.

అయినా ఆమె రాకపోవడం ఆశ్చర్యంగా వుంది.

ఏమైనా ఈరోజు మిస్ అయ్యే అవకాశం మాత్రం లేదు. ఎందుకంటే ఫస్ట్ బస్ టైముకే వచ్చి నిలుచున్నాడు అతను.

మొదటి రెండు బస్ లకీ రాలేదంటే·యిక ఈ బస్ కి తప్పకుండా వస్తుందన్నమాట. వారం రోజుల నుంచీ చూస్తున్నాడు... ఆమె ఏ బస్ లో వెళ్ళిపోతోందో అర్థం కావడం లేదు.

తను పడ్డ కష్టాలు తల్చుకుంటే తనమీద తనకే జాలివేసింది సునీల్ కి.

త్వరగా నిద్ర లేచాడు. అది చూసి యింట్లో అందరూ స్పృహ తప్పినంత పని చేశారు.

వెంటనే స్నానం చేశాడు, యిక యింట్లోవాళ్ళ ఆశ్చర్యం చెప్పనే అక్కరలేదు.

ఇదే సందు అనుకుని అక్కయ్య ఉపదేశాలు మొదలుపెట్టింది. "త్వరగా లేచినప్పుడన్నా కాస్త సరిగా స్నానం చేసి తగలడరా. నిన్ను చూస్తుంటే ఏరియల్ నీళ్ళలో ముంచాలనిపిస్తోంది.." అంటూ.

ఇంకొకసారి అయితే తనుకూడా తగిన సమాధానం చెప్పివుండేవాడే. ఈరోజు మాత్రం వాళ్ళందరినీ అలాగే ఆశ్చర్యాంబుధిలో వదిలేసి వచ్చేశాడు.

ఏం లాభం! ఆమె దర్శనం మాత్రం కాలేదు. తను పడ్డ కష్టాలన్నిటికీ ప్రతిఫలంగా, ఆమె తనని చూసి ఒక్కసారి నవ్వితే చాలు అనిపిస్తుంది సునీల్ కి.

ఆమె కోసం వెయిట్ చేస్తూ నిన్న ఎగ్జామ్ మిస్ చేసుకున్నాడు. ఎగ్జామ్ అంటే రాసినా రాయకపోయినా యింట్లో వాళ్ళకి తెలీదు.

కానీ బస్ పాస్. అది కూడా చేయించుకోలేదు. ఇక ఈనెల అంతా టికెట్ కొనుక్కుని వెళ్ళాలంటే డబ్బులెలాగో!

అమ్మకి కాస్త మస్కా కొట్టాలి. తను కూడా సిగరెట్లూ.. పాన్ లూ తగ్గించాలేమో! అసలు తను ఫ్రీగా ఖర్చు పెడితే ఆ బస్ పాస్ డబ్బులు ఒక్కరోజు ఖర్చుకి చాలవు. ఆ భయం తోనే రోజూ బస్ టికెట్ కి సరిపోయే డబ్బులు మాత్రం తీసుకుని మిగతావి యింట్లోనే వదిలేసి వస్తున్నాడు... ఈ నాల్రోజులనుంచీ.

ఆలోచనలతోపాటే అసహనం తన్నుకు రావడంతో బస్ స్టాప్ లోని యినుప రాడ్ ని ఒకసారి విసురుగా తన్నాడు సునీల్ తన ఖరీదైన షూస్ తో.

సరిగ్గా అప్పుడే కనిపించింది "ఆమె"... దూరంగా.. మెరుపు మెరిసినట్లు.

కళ్ళార్పడం కూడా మర్చిపోయి చూశాడు సునీల్. చాలా సాధారణంగా అలంకరించుకుంది. అయినా అంత తేజస్సు ఎలా వస్తూందో!

వంటి మీద ఎక్కడా రవ్వంత బంగారం లేదు. కానీ తనే ఓ పోతపోసిన బంగారుబొమ్మలా మెరిసిపోతోంది.

ఆమె అలా నడిచి వస్తూంటే, ఓ వెన్నెల కిరణం నడచి వస్తూన్నట్లుగా వుంది.

ఒక లయ వుంది ఆమె నడకలో. నడుస్తూన్నపుడు చీర కుచ్చెళ్ళు నాట్యం చేస్తున్నట్లుగా కదులుతున్నాయి.

నల్లటి చీర కుచ్చెళ్ళ చాటు నుండి కనపడుతూ, మాయమవుతూ, దాగుడు మూతలాడుతున్నాయి.. మల్లెపూల లాంటి పాదాలు.

అలా.. ఆ పాదాలని చూస్తూ ఎన్ని సంవత్సరాలయినా గడిపేయవచ్చుననిపించింది సునీల్ కి.
వాటి ప్రక్కన నడిచే భాగ్యం కోసం ఎన్ని యుగాలయినా తపస్సు చేయవచ్చుననిపించింది.
అక్కడెక్కడో.. ఎవర్నో.. ఆమె నవ్వుతూ పలకరిస్తుంటే.. యిక్కడ తనమీద పూలవర్షం కురిసినట్లనిపించింది.
అప్పుడు ఆపళంగా వెళ్ళి తనని నిప్పులలో దూకమంటే దూకేయగలననే అనిపించింది.
ఇంతలో ఏదో బస్ వచ్చి తన ప్రక్కన ఆగిందనిపించింది. అనిపించడం కాదు... నిజంగానే వచ్చింది.
ఆ అమ్మాయి బస్ ఎక్కుతూంటే, అప్పుడు స్పృహ వచ్చినట్లుగా కదిలాడు సునీల్. తను కూడా పరుగెత్తి బస్ ఎక్కబోయాడు. వెనుకనుంచి ఎక్కే అవకాశం లేదు. విపరీతమయిన రష్ గా వుంది.
బస్ కదిలిపోతుంటే.. యిక లాభం లేదని, ముందువైపుకు వెళ్ళి ఎక్కేశాడు. డ్రైవర్ తిట్టాడు. తమమీదుగా లోపలికి వెళ్తూంటే ఆడవాళ్ళు శాపనార్థాలు పెట్టారు. సునీల్ కి వాటిలో కొన్ని వినపడ్డాయి. కొన్ని వినపడలేదు. మొత్తం మీద ఏవీ అర్థం కాలేదు.
పద్మవ్యూహంలోకి వెళ్తున్న అభిమన్యుడిలా వెళ్ళిపోయి, ఆ అమ్మాయి కూర్చున్న చోటికి చేరాడు. అక్కడ అంతగా రష్ లేదు.
కుదుటపడ్డ మనసుతో ఆమె సీట్ ప్రక్కనే వున్న రాడ్ కి ఆనుకుని నిలబడ్డాడు.
ఆమె మాత్రం బస్ లో కూర్చోవడం ఆలస్యం ఏదో పుస్తకం తీసి చదువుకోసాగింది. ఆ ధోరణి చూసి సునీల్ కి చెప్పలేనంత రోషం వచ్చింది. "ఏమిటో అంత సీరియస్ నెస్! ఒక్కసారి నావైపు చూడకూడదూ! చల్లని నవ్వుతో పలకరించకూడదూ!" అనుకున్నాడు.
ఒక్కసారి.. ఒక్కసారి ఆమె తనని చూసి నవ్వితే చాలు, జన్మ ధన్యమయిపోతుంది. ఆమె జడలోనుంచి వస్తున్న మల్లెలవాసన అతనికి మతిపోగొడ్తోంది. తన చేతిని మెల్లగా జరిపి ఆమె తల వెనుకనున్న రాడ్ ని పట్టుకున్నాడు. ప్రతి చిన్న కుదుపుకీ, ఆమె తల అతనిని తాకుతోంది. మల్లెపూలలోని తడి చేతికి అంటుకుంటోంది.

సడన్ బ్రేక్ వేయడంతో ఆమె ప్రక్కకి తిరిగి బాలన్స్ చేసుకుంది. ఆమె చెవికి వున్న లోలకులు వత్తుకుని అతని చేతిమీద ముద్ర పడింది. చిన్నగా గీసుకుపోయింది.

"ఈ జీవితానికి ఈ ఆనందం చాలు" అనుకున్నాడు సునీల్.

అదే క్షణంలో కండక్టర్ వచ్చాడు.. ఆ ఆనందాన్ని పాడుచేసే రాక్షసుడిలా.. "టికెట్" అంటూ.

జేబులో నుంచి అయిదురూపాయలు తీసి యిచ్చి, ఎక్కడికి వెళ్ళాలో చెప్పాడు సునీల్. టికెట్ తో పాటూ వచ్చిన చిల్లరని జేబులో వేసుకోబోతూ వుండగానే ఒక కాయిన్ పడిపోయింది.

పడటం.. పడటమే దొర్లుకుంటూ పోయి, అవతలి ప్రక్క సీట్ కి అరంగుళం యివతల ఆగింది. అతను వంగి తీసుకోబోయాడు. అపుడే ఆమె యిటు తిరిగి అతనిని చూసింది. క్షణంలో వెయ్యోవంతులో వంగే ప్రయత్నం విరమించుకున్నాడు సునీల్. స్ట్రెయిట్ గా నిలుచున్నాడు.

"అవును మరి.. ఎపుడూ ఎవరినీ పట్టించుకోని ఆమె.. చూడక చూడక తనవైపు చూస్తే.. తను అసహ్యంగా వంగుని ఆడ్ పోజులో కనిపిస్తే ఎలా! పోతేపోయింది వెధవ అర్ధరూపాయి. అసలింతకీ అది అర్ధరూపాయా! రూపాయా! రూపాయి అయితే కష్టం. వచ్చేటప్పుడు టికట్టుకు డబ్బులు చాలవు."

ఆమె మొహం తిప్పేసుకుంది. సునీల్ ఓరగా కాయిన్ పడ్డ వైపు చూశాడు.

అది అక్కడే వుంది. అర్ధరూపాయి కాదు. రూపాయే. అతను వంగబోయేంతలో ఆమె మళ్ళీ తల త్రిప్పి చూసింది.

సునీల్ కంగారుగానూ, యిబ్బందిగానూ నవ్వి స్ట్రెయిట్ గా నిలుచున్నాడు. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం కనిపించింది. మరో రెండుసార్లు అతని వైపు అనుమానంగా చూసింది.

"భగవంతుడా!.." అనుకున్నాడు సునీల్. పోనీ తర్వాత తీసుకుందాంలే అంటే.., ముందు సీట్లో కూర్చున్న చింపిరి జుట్టు పిల్ల ఈ తంతు అంతా చూస్తూనే వుంది. ఏ క్షణంలో వంగి ఆ రూపాయి కొంగుకు కట్టుకుంటుందో!

ఆలోచిస్తున్న అతనికి ఏదో అయిడియా వచ్చింది. తన తెలివికి తనే మురిసిపోతూ, ఎడమ కాలుని కొద్దిగా జరిపి ఆ కాయిన్ మీద పెట్టాడు.

చింపిరి జుట్టు పిల్ల ఒకసారి అతని మొహంలోకి చూసి మళ్ళీ తలదించుకుంది.

ఆ పిల్ల చూసినందుకు కాదు కానీ. . అలా నిల్చోవడం అతనికే చాలా యిబ్బందిగా వుంది. మనిషి అంతా కుడివైపుకి వుండి ఒక్క కాలు మాత్రం ఎడమవైపుకి తోయడం. . నడుము నొప్పి పుడుతోంది.

కానీ ఏం చేస్తాడు! ప్రేమికులన్నాక ఆమాత్రం పరీక్షలు తప్పవు. అందుకే ఆమెని చూస్తూ తన బాధని మర్చిపోయే ప్రయత్నం చేయసాగాడు.

ఆమె మాత్రం ప్రక్కనున్న ముసలావిడతో కబుర్లు చెప్తూంది, తన బాధని రవ్వంత అయినా పట్టించుకోకుండా.

వారం రోజుల క్రితమే ఏదో పార్ట్ టైం జాబ్ లో చేరిందట. ప్రొద్దున్నే రెండు గంటలు వర్క్ చేస్తే నెలకి అయిదొందలు వస్తాయిట. రోజా ఆ జాబ్ కి వెళ్ళి అక్కడి నుండి కాలేజీకి వెళ్తుందిట.

వివరాలన్నీ విని ముసలావిడ మెచ్చుకుంటోంది. సునీల్ కి మాత్రం గుండెల్లో రాయి పడింది. "పార్ట్ టైం జాబా! రోజా యింత ప్రొద్దున్నే బయల్దేరి వెళ్తుందా! అంటే తను కూడా యింత త్వరగా రావాలా! ఇంపాసిబుల్. ఏదొ ఒకరోజంటే లేచాడు కానీ రోజా యింత ప్రొద్దున్నే లేవడం తన వల్ల కాదు గాక కాదు."

అతను ఆలోచిస్తూ వుండగానే బస్ సడన్ బ్రేక్ తో ఆగి మళ్ళీ బయల్దేరింది. బస్ కి అడ్డం వచ్చిన కాలేజీ కుర్రాడిని డ్రైవర్ పిచ్చి తిట్లు తిడుతున్నాడు.

వంకర టింకరగా నిలుచున్న సునీల్ కి మాత్రం క్రింద పడినంత పనయ్యింది. నడుము కలుక్కుమంది.

అతని సహనానికి పరీక్ష పెడుతూన్నట్లూ కండక్టర్ వచ్చాడు. బస్ అంతా నాదే! అన్నట్లుగా నిలుచున్న సునీల్ ని ఆశ్చర్యంగా చూసి, ప్రక్కకి జరగమన్నాడు.

పాపం! జరగడానికి సునీల్ కి కూడా అభ్యంతరం లేదు. కానీ ఎటు ప్రక్కకి జరుగుతాడు! కుడివైపా! ఎడమవైపా!

కుడి వైపు జరిగితే, కాయిన్ మీద నుంచి కాలు తీయాలి. ఎడమవైపు జరిగితే. . వెనకాల వున్న డబ్బామొహం ముసలాడు ఆమె ప్రక్కకి వచ్చి నిలబడతాడు.

క్షణంలో వెయ్యోవంతులో నిర్ణయం తీసుకున్నాడు సునీల్. రూపాయిని త్యాగం చేసి (టెంపరరీగా) కుడివైపుకి జరిగాడు.

అంతే. ముందుసీట్లోని పిల్ల టకీమని వంగింది. రూపాయి తీసుకుని నడుముకి కట్టుకున్న సంచిలో వేసేసుకుంది.

అప్పటిదాకా పడిన శ్రమ అంతా వేస్ట్ అవడంతో సునీల్ కళ్లనీళ్ళ పర్యంతం అయ్యాడు.
"ఆ రూపాయి నాది. ఇచ్చేయి." అని అడుగుదామనుకున్నాడు.
మళ్ళీ అంతలోనే అనిపించింది. "వెధవ రూపాయి. ముష్టి రూపాయి. దానికోసం బాధపడటమేమిటి, లేకివెధవలా! ఆమె చూస్తే ఏమనుకుంటుంది!" అని.
రూపాయి పోతే పోయింది కానీ నిజానికి ఈరోజు చాలా బాగుంది. వారం రోజులుగా కనపడని ఆమె యివాళ కనపడింది. ఇలా ఆమె ప్రక్కనే నిలబడే అవకాశం వచ్చింది. ఎపుడూ కన్నెత్తి చూడని ఆమె, ఈరోజు తనని నాలుగుసార్లు చూసింది. ఇంక కాసేపయితే.. తన చిరకాల కోరిక తీరేలా.. తనని చూసి నవ్వుతుందేమో! ఏమో ఎవరు చెప్పొచ్చారు! ఒక్కొక్కసారి అద్భుతాలు జరుగుతాయి.. నిజంగా అదే జరిగితే తన జీవితం ధన్యమయినట్లే.."
సునీల్ ఆలోచనలలోనుంచి తేరుకోకముందే ఆమె దిగవలసిన స్టాప్ వచ్చింది. లేచి ముందుకి వెళ్తూ, కండక్టర్ ని అడుగుతోందామె.. "నాకు పదిపైసలు యివ్వాలి. ఇస్తారా!" అని.
సునీల్ చూస్తూనే వున్నాడు. కండక్టర్ యిచ్చిన చిల్లర పర్స్ లో వేసుకుంటూ ఆమె దిగిపోయింది.
ఆఖరిమెట్టు మీదనుండ దిగేముందు మాత్రం ఒక్కసారి వెనక్కి తిరిగింది. ... క్షణంలో వెయ్యోవంతూ చిన్నగా నవ్వింది.
సునీల్ వులిక్కిపడ్డాడు. "ఎవరిని చూసి నవ్విందామె! నన్ను చూసేనా!" అనుకున్నాడు.
సందేహమెందుకు! అతనిని చూసే. ... అతనిలా బాధ్యత తెలియని వాళ్ళని ఎంతోమందిని చూసే... ఆమె నవ్వింది... అపహాస్యంగా.

*****